హరి మయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు సంశయము పనిలేదు
హరి మయము గాని వస్తువు
ఇలలో కనుపించరాదు...

నమ్మి కొల్వ రాయి నారాయణుండౌను
నమ్మకున్న వట్టి దిమ్మె సుమ్మి
నమ్మి చెడిన వారు నరుల యందును లేరు
ఉన్నమాట చెప్పుచున్నమాట.

ప్రియమైన విద్యార్థులారా!

దుర్లభమ్ మానుష దేహి ప్రపంచమునందు సమస్త ప్రాణుల లోన మానవ దేహము దుర్లభమైనది. ఈ దేహమునకు ఇంతటి శ్రేష్ఠత, ఇంతటి విశిష్టత వుండినప్పటికిని 'జ్ఞానేన శూన్య పశుభిస్సమాన' యే మానవుని సర్వ జంతు సామాన్యమునుండి వేరు పరచి తన్నధికము గావించినదో అట్టి జ్ఞానమే లేకుండిన మానవుడు పశువులో సమానము. ఇట్టి ఉత్కృష్టమైన, పవిత్రమైన మానవ జన్మమునకు లభించియు దీనిని సక్రమమైన మార్గములో వినియోగించుకొనక మానవుడు దురాశలకు దుర్బుద్ధులకు, దురాలోచనలకు యీ దేహమును అపవిత్రమైన మార్గములో అనుభవిస్తున్నాడు. నివృత్తి మార్గములో ప్రవర్తించవలసిన మానవుడు నివృత్తి మార్గములో ఆనందమును అనుభవించవలసిన మానవుడు ప్రవృత్తికి లోబడి మనోయింద్రియములకు వశమై తన జీవితమును వ్యర్థము గావించుకొను చున్నాడు. భోగాసక్తిని అనుభవించుటకు అనేక విధముల ప్రయత్నించుచున్నాడే గాని, యోగాసక్తిని, త్యాగాసక్తిని యేమాత్రము కూడను తాను అభివృద్ధి గావించుకొనుటకు తగినంత కృషి సల్పటము లేదు. ఆకార మానవుడు వుండినంత మాత్రమున ప్రయోజనము లేదు. ఈ ఆకార మానవుని చేత జాతికి యేమాత్రము కూడను విశిష్టత యేర్పడదు. ఆకార మానవత్వము చేత జాతికి దివ్యమైన దైవత్వమును చేకూర్చకొన లేదు. ఆకారముతో బాటు ఆచార విచారములు అత్యవసరమనే సత్యమును గుర్తించటము అత్యవసరము. ఆచార విచారములే లేకుండిన మానవుడు ఆకారపుష్టినే అనుభవించగలడుగాని ఆత్మానందమును అనుభవించ లేడు.

ఈనాటి మానవుడు కేవలము దేహమునే ఆధారముగను ప్రధానముగను విశ్వసించి తనయొక్క ఆధారతత్వమైన దివ్యత్వమును విస్మరించి మానవుడు కేవలము భౌతికమైన జీవితమును అభివృద్ధి గావించుకొను చున్నాడు. అందువలననే

లోకములో యేమానవుడు కూడను శాంతి భద్రతలను పుష్టిగా అనుభవించటము లేదు. నిరంతరము అసంతృప్తి తోనే జీవితము గడుపుచున్నాడు. యీ అసంతృప్తి వలన రెండు విధములైన నష్టములు చేకూరుచున్నవి మానవునకు. ఈ అసంతృప్తి వలన అశాంతి ఒకటి. అశాంతి వల్ల అసుఖము మరొకటి. శాంతి లేనివానికి సుఖమనేది యేమాత్రము వుండదు. కనుక అసంతృప్తికి కారణం యేమిటి? దీనికి అసూయనే మూలకారణము. ఈ అసూయ అనేది కేవలము అనాది కాలమునుండి పేరుకొన్న ఒక దుష్టగుణము. మానవుని హృదయమునందు అసూయ యేనాడు నిర్మూలమగునో ఆనాడే మానవుడు సంతృప్తిని అందుకుంటాడు. సంతృప్తికల మానవుడు శాంతిని అనుభవిస్తున్నాడు. ఈ అసంతృప్తికి కారణము యేమిటి! ఈ అసూయకు కారణం యేమిటి? మానవుడు నిరంతరము కూడను తనకంటె వున్నత స్థాయి యందు వున్నవానిని, తనకంటె వున్నత మార్కులు పొందిన వానిని, తనకంటె వున్నత ఆనందమును అనుభవించే వానిని, తనకంటె వున్నత సౌందర్యము కలిగిన వానిని చూడటం చేతనే తన లోపల తాను అంతటి వాడను కాలేక పోతిని కదా అనే దాంట్లో అసూయ ప్రారంభమవుతుంది. తనకంటె వున్నత స్థాయి యందున్నవానిని చూచినప్పుడే తనకు అసూయ ప్రారంభిస్తుంది. కాని దీనికి సంతృప్తి పొందవలసిన మానవుడు అసూయక్రింద మార్చుకొనుచున్నాడు. ఈ అసూయను మనము నిర్మూలము గావించవలెనన్న తనకంటె తక్కువ స్థాయి యందు వున్న వ్యక్తిని మనము కొంతవరకు గుర్తించినప్పుడే మనకు అసూయకు యేమాత్రము అవకాశము వుండదు. తనకంటె తక్కువ మార్కులు తీసుకొన్న వానిని చూచినప్పుడు ఓ అతనికంటె నేనే బెటర్ అనేదానిలో కొంతవరకు తృప్తి పొందుతాడు. అతనికంటె తక్కువ స్థాయిలో వుండిన వుద్యోగిని చూచినప్పుడు ఓ అతను నాకంటె తక్కువస్థాయిలో వున్నాడు అని తాను సంతృప్తి పడతాడు. కనుక మొట్టమొదట అసూయను నిర్మూలము గావించుకోవలెనన్న యీవిధమైన మార్గమును మనము అవలంబించవలెను. క్రమక్రమేణా యీవిధమైన దృష్టి వున్నతమైన వుద్యోగిని చూచినప్పటికిని, వున్నత స్థాయి యందు వున్న వారిని చూచినప్పటికిని, వున్నతమైన మార్కులు పొందిన వానిని చూచినప్పటికి క్రమక్రమేణా దీనిని సమంగా మార్చుకొనుటకు అవకాశము వుంటుంది. ముఖ్యముగా అధికమైన వానిని చూచినప్పటికిని, తనకంటె తక్కువ స్థాయి యందు వున్న వానిని చూచినప్పుటికిని సమచిత్తమును అభివృద్ధిపరచుకొనే దివ్యమైన గుణమును అలవర్చుకోవాలి. తానును అంతటి స్థాయికి పోవాలని ఆశించటములో తప్పులేదుగాని వున్నత స్థాయి యందు వున్నవానిని గుర్తించి తాను అసూయపడటం ఇది మహా తప్పు.

జంతూనాం నరజన్మ దుర్లభము. మానవ జన్మము చాలా దుర్లభమైనది. ఇంక యే జన్మలకు యింతటి విజ్ఞాన విచక్షణతో కూడిన తెలివితేటలు వుండటం లేదు. ముఖ్యముగా శరీరమునందు గాని, వైజ్ఞానికమునందుగాని, ఆధ్యాత్మికమునందుగాని పరిపూర్ణమైన వ్యాప్తిని మనము పొందవలెనన్న శరీరము పుష్టిగా వుంటుండాలి. ఆరోగ్య

519018903

మనకు ఆటపాటలు అత్యవసరము. అయితే యీ ఆరోగ్యము కేవలము దేహమునకు మాత్రమే సంబంధించినది కాదు. దీనితో బాటు మానసిక సంబంధమైన ఆరోగ్యము అత్యవసరము. శరీర మానసిక ఆరోగ్యములు సంతుష్టిగా వుండినప్పుడే మానవుడు తన సంకల్పమును విజయవంతముగా సాధించుకోగలడు. కాని శరీర మానసిక ఆరోగ్యములు సక్రమముగా లేనప్పుడు యే చిన్న కార్యమును తాను విజయవంతముగా వించుకొనలేడు. కనుక యిట్టి పరిపూర్ణమైన వికాసమునకు త్రికరణ శుద్ధి చాలా ప్రధానము. త్రికరణములనగా వాక్కు, చేతులు, మనస్సు యీ మూడు పవిత్రమైన కరణములుగా మనము నిరూపించాలి. వేదమునందు మూడు విధమైన కాండములు వుంటున్నాయి. కర్మకాండ, వుపాసనా కాండ, జ్ఞానకాండ అని. దీనినే యోగత్రయములని కర్మయోగము, భక్తియోగము, జ్ఞాన యోగము అని నిరూపిస్తూ వచ్చింది.

మొట్టమొదటిది కర్మము. కర్మకు కరణములు అత్యవసరము. ఏ కర్మలు ఆచరించవలెనన్న మన కరములు చాలా ప్రధానమైనవి. మనము చేతులలో చేసే సమస్త కర్మలు పవిత్రమైనవిగను, పరోపకార సంబంధమైనవిగను సార్థకమైనవిగను వుండాలి. అట్టి కర్మలు యీ చేతులు ఆచరించినప్పుడే కరములు పవిత్రమైనవిగా నిరూపిస్తాయి. ఇది మొట్టమొదటి కర్మశుద్ధి. ఈ కర్మల చేత చిత్తము కూడను శుద్ధి అవుతుంది. చిత్తస్య శుద్ధయే కర్మణః. మానవుడు ఆచరించే సమస్త కర్మల వలన చిత్తశుద్ధి మనకు లభిస్తుంది. చిత్తశుద్ధి వుండినంత మాత్రమున ప్రయోజనము లేదు. చిత్తైకాగ్రత కూడను అత్యవసరము. ఈ చిత్తైకాగ్రతకు భక్తి ఆధారము. భక్తి అనగా యేమిటి? భగవంతునితో విభక్తము కానిదే భక్తి అని అర్థము. సర్వత్ర భగవత్ తత్త్వమనే సత్యాన్ని మనము గుర్తించినప్పుడు మన భావము భగవంతునికి మనకు ఎడబాటు సంభవించదు. ఇట్టి సర్వవ్యాపకత్వమైన, దివ్యత్వమైన భగవంతుని మనము స్మరించవలెనన్న, భజించవలెనన్న, చింతించవలెనన్న నాలుక అత్యవసరము. కనుకనే

జిహ్వే రసజ్ఞే మధుర ప్రియత్వం సత్యం హితం త్వాం పరమం వదామి
ఆవరణమేకా మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి.

అన్నాడు జయదేవుడు. నాలుకా, పవిత్రమైన నాలుక, సార్థకమైన నాలుక, దివ్యమైన నాలుక భవ్యమైన నాలుక యీ నాలుక చేత యెవరిని బాధించే పదములు వుపయోగించరాదు. ఎవరిని చింతింపచేసే పదములు వుపయోగించరాదు. దీనితో సత్యమునే మనము వుచ్చరించాలి. ప్రియమైన పదములనే మనము పలకాలి. హితమైన వాక్యములే మనము వుచ్చరించాలి. ఈ పదములు కూడను కటువైన పదములుగా వుంటుండరాదు. అందువలనే భగవద్గీతలో

అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితంచ యత్
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప వుచ్యతే.

519018904

ప్రీతిగను, హితముగను, వుద్రేకము లేనిదిగను వుండాలి మన వాక్కు. అప్పుడే మన నాలుక పవిత్రమైన కరణముగా యేర్పడుతుంది. ఈ విధమైన పవిత్రమైన కరణముగా మనము వుపయోగించుకున్నప్పుడే మన జన్మకూడను సార్థకమవుతుంది.

సత్యంనాస్తి పరో ధర్మః. మనకు నిజమైన ధర్మము యేమిటి? సత్యముకంటె మించిన ధర్మము మరొకటి లేదు. సత్యమేవ జయతే. సత్యమే మనకు జయిస్తుంది. యిలాంటి సత్యమును మనము యేనాటికిని మరువరాదు. బలి చక్రవర్తి చెప్పాడు పలికి బొంకుటకన్న పాపమున్నె ఒక్కతూరి మనము వాక్కు యిచ్చిన తరువాత దానిని బొంకినవాడు మహాపాపి అని నిరూపించాడు. మనము యేదైన వాగ్దానము యిచ్చినామంటే ఏదైనా ఒకప్రమాణము చేసినామంటే దానిని ప్రాణము పోయినాసరే కాని ఆ వాగ్దానము చెల్లించుకోటానికి తగిన కృషి చెయ్యాలి. కానీ యీనాడు అది మాత్రమే తక్కువ అయింది. ప్రపంచములో యీనాడు యిచ్చిన వాగ్దానము రేపటి దినము మరణిస్తున్నాది. క్షణమునకు ఎన్నో పర్యాయములు చస్తూ బ్రతుకుతూ వున్నాది యీ వాగ్దానము. ఇలాంటి వాక్కుకు ప్రాణము లేకుండా చేసుకునే వ్యక్తి living death బ్రతికి చచ్చిన వానితో సమానము. కనుకనే మన వాగ్దానమును ప్రాణమునైనను త్యాగము చేయవచ్చుగాని వాగ్దానము మీరరాదు, మారరాదు. కనుకనే మాటకు ప్రాణము సత్యము. మన మాటకు life truth. కోటకు ప్రాణము సైన్యము. జాతికి ప్రాణము నీతి. నోటుకు ప్రాణము ప్రిటు. మనము ప్రామిసరీ నోటు వ్రాసినామంటే దానికి ప్రాణము యేమిటి మన signature ప్రాణము. signature లేకపోతే యీ ప్రామిసరీ నోటు యేమి పనికిరాదు. కనుక మాటకు ప్రాణము సత్యము కనుక మాటను ఒకనాడు యెప్పుడైనా వదలుకున్నామంటే జీవితమంతా యిలా వదలటములోనే అలవాటైపోతుంది. ఈ సత్యపాలన నిమిత్తమై హరిశ్చంద్రుడు తన రాజ్యమును, తన పత్నిని, తన కుమారుని కూడను ధారపోసుకొని కట్టకడపటికి కాటికాపరియై కూడను తన జీవితమును గడుపుకున్నప్పటికి సత్యాన్ని వదలలేదు కనుకనే సత్యహరిశ్చంద్రుని యొక్క చరిత్ర తరతరములనుండి దిగదిగంతరములవరకు దేదీప్యమానముగా వెలుగుతూ వస్తూంది. అట్టి సార్థకనామమును మనము పొందాలనుకున్నప్పుడు సత్యాన్ని పాటించాలి. ఏ భగవత్ నామమైనను సత్యవాక్పాలనాయనమః సత్యప్రచారాయనమః, సత్యస్వరూపాయనమః అని భగవంతుని నామము లోపల భగవంతునికి సత్యము సత్యము సత్యము భగవత్ స్వరూపము. Truth is God. అన్నారు. ఇలాంటి సత్యాన్ని మనము మన యొక్క వాక్కుద్వారా, జిహ్వద్వారా మనము పవిత్రము గావించుకోటమే యీ రెండవ కరణము యొక్క పరిశుద్ధము

విద్యార్థులారా! ఇది పవిత్రమైన వయస్సు. సర్వవిధముల మానవత్వాన్ని వికసింపజేసే వయస్సు. దివ్యత్వమును ప్రకటింపజేసే వయస్సు. ఇట్టి వయస్సునందే యిట్టి పవిత్రమైన వాక్కును మనము సంరక్షించుకొనుటకు సరైన కృషి చేయాలి.

519018905

మనము తాత్కాలికమైన తృప్తి నిమిత్తమై పదములు వుపయోగపెడుతున్నామే గాని, వాగ్దానములు యిస్తున్నామే గాని అవి శాశ్వతమైన రీతిగా మనము కాపాడుకోటము లేదు. అందువలనే భగవద్గీత యందు

అనన్యాశ్చింతయన్తో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్.

ఎవరు ఎవరైనా సరే ఏ జనా యే జనమైనప్పటికిని పరవాలేదు వాడు నన్ను నిరంతరము నన్ను స్మరిస్తూ వున్నప్పుడు వాని యొక్క యోగక్షేమములు నేను చూచుకుంటానన్నాడు. ఈ యోగమంటే యేమిటి. మనము సంపాయించుకున్న పవిత్రమైన అవకాశము, సన్నివేశము మీరు చూస్తున్నారు ప్రతిదినము వేలాది మైళ్ళనుంచి కూడను, అనేక దేశములనుంచి కూడను ఎన్నోవేలు ఖర్చుపెట్టుకొని యెంతో కాలము వ్యర్థము చేసుకొని యిక్కడ ప్రవేశించి స్వామి ఒక్క పలుకు పలుకరిస్తే చాలు ఆనందమును అనుభవించేవారు వేలకు లక్షలకు వుంటున్నారు. కాసు ఖర్చులేకుండా, కాలము వ్యర్థము చేయకుండా శరీరమునకు బాధలు కలుగకుండా శ్రమ కలగకుండా సులభముగా స్వామి సన్నిధిని స్వామి పెన్నిధి మీకు లభించినప్పుడు మీరు దానిని యెంత అలక్ష్యముగా వుపయోగపెట్టుకుంటున్నారు. ఎంత అలక్ష్యముగా మీరు అనుభవిస్తున్నారు. ఏ జన్మ జన్మాంతర సుకృతము చేతనో యీ విధమైన అవకాశము మీకు లభించింది. ఆ లభించటమే యోగము అనుకోవాలి. ఈ జన్మది కాదు. ఎన్నియో జన్మల ఫలితముగా యిది యీనాడు ప్రాప్తించింది. కానీ ప్రాప్తించింది యిదే యోగము కాని దీనిని సంరక్షించుకోటమే క్షేమము. లభించిన దానిని మీరు పోషించుకోటానికి తగిన కృషి చేయటం లేదు. ఇలాంటి లభించిన యోగమును క్షేమ మనగా యేమిటి దానిని సంరక్షించుకోటమే క్షేమము. భక్తమీరా, సక్కుబాయి వీరందరు అనేక రకములుగా స్వామి ఎన్నియో కష్టములకు నష్టములకు దుఃఖములకు నిందలకు నిష్ఠూరములకు లోంగి మేము మీ యొక్క అనుగ్రహమునకు పాత్రులమైనాము గాని దీనిని చక్కగా నిలబెట్టుమని ప్రార్థించారు. మీరా చెప్పింది. ఓ భగవంతుడా! సముద్రములో వుండిన ముత్యము సులభముగా చిక్కేది కాదు. ఇలాంటి అగాధమైన, అనంతమైన సముద్రమునందు యెన్నియో కష్టములు పడి నేను యీ ముత్యాన్ని సంపాయించుకున్నాను. సంపాయించుకోటంలో గొప్పతనము కాదు. ఆ చేజిక్కిన యీ ముత్యమును చేతినుంచి జారిపోకుండా కాపాడండి అనింది. అదే యోగక్షేమము. సంపాయించుకొన్నది అదృష్టవశాత్తు లభించవచ్చు. కాని లభించిన దానిని కాపాడుకోటమే క్షేమము. ఇది యే విధమైన క్షేమము. ఆధ్యాత్మికము, ఆదిభౌతికము, ఆదిదైవికము మూడింటి యందు క్షేమమే. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక క్షేమమే. కాని యీ సత్యాన్ని మీరు గుర్తించుకునే సమయములో దీనిని గుర్తించుకొనకుండ దీనిని జారవిడుచుకుంటూ వున్నారు.

విద్యార్థులారా! మీరు వదలకోటం సులభమే కాని దీనియొక్క

పరిణామము, దాని యొక్క భవిష్యత్తు యే విధముగా మిమ్మల్లను బాధపెడుతుందోనేది స్వామికి తెలుసు కనుకనే స్వామి పదే పదే బాధపడుతూ వుంటాడు. అయ్యో ఈ విద్యార్థులు చిక్కిన అవకాశమును వదులుకొని భవిష్యత్తులో యే విధమైన బాధలకు గురిఅవుతున్నారే అనే బాధ స్వామిది. ఏదో యిక్కడ వుండినంతవరకు మీము మాటలు చెప్పి ప్రమాణములు యిచ్చి, వాగ్దానములు చేసి కాలమును మానవుడు గడపుకొని ఈ కోర్సు అయిన తక్షణమే యెక్కడకైనా పోవచ్చు యే రేసు కోర్సుకైనా పోవచ్చు యే భయము లేదనే ధైర్యముతో ధీమాతో మీరు మెలగుతున్నారు. చాలా పొరపాటు పొరపాటు. దాని యొక్క ఫలితము నేడు కాకపోయినా రేపైనా మిమ్మల్లను బాధిస్తుంది. ఆ బాధించకుండా చూచుకోటానికి మీరు కృషి చేయండి. ఈ నాడు నవ్వుతూ నవ్వుతూ మీరు వాగ్దానాన్ని వుల్లఘించి పోతే రేపటి దినము యేడుస్తూ యేడుస్తూ అనుభవించవలసి వస్తుంది.

మన దేహములో ప్రధానమైన అంగము నాలుక. నాలుకే పశువా అనిపిస్తుంది. పశుపతి అనిపిస్తుంది. ఉన్నత స్థాయికి గొనిపోతుంది. అధోగతికి దించివేస్తుంది కనుకనే నాలుకను అంత ప్రధానమైన ప్రమాణముగా నిరూపిస్తూ వచ్చింది వేదము. మన యొక్క నాలుక నుంచి వచ్చిన పదములు జారవిడిస్తిమా నాలుకనే జారవిడిచిన వారమవుతాము. నాలుక వుండి లేనివానితో సమానమవుతాము. కనుక రెండవ కరణము నాలుక. దీనిని అతి జాగ్రత్తగా మనము కాపాడుకోవాలి. కనుక నాలుక చేత పవిత్రమైన పదములను యోచించి విచారించి, కొంత ఆలోచించి దీనిని వుపయోగపెట్టటం అత్యవసరము. ఏదో emotion లో excitement తో మీరు యేవో కొన్ని విధములైన పదములు వుపయోగపెట్టవచ్చును. కాని దానికి Reaction, Rebound and Reflection వుండనే వుంటుంది. కనుక మన వచనమును చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఎక్కడికి వెళ్లినప్పటికిని మన యొక్క వాక్కును సరైన రీతిగా పోషించుకోవాలి. ఎవరి హృదయాన్ని బాధపెట్టునటువంటి పదములు వుపయోగించుకోవాలి. కాలు జారితే కలుగదు నష్టము నాలుక జారుతే నరకమురా అన్నారు. కాలు జారిపడితిమంటే యేదో కొంచెం దెబ్బ తగులుతుంది. ఆ దెబ్బ కంటికి కనుపిస్తుంది. ఏ డాక్టరు దగ్గరకు వెళ్లినా అతనిని ప్రార్థించి బ్యాండేజి కట్టుకొని ఔషధము వేసుకొని నయము చేసుకోవచ్చు. కాని నాలుక జారితే హృదయానికి ఎక్కడ దెబ్బ తగులుతుందో కనుపించదు. ఎవ్వరూ చూడలేరు. ఏ డాక్టరు కూడను దీనిని నయము గావించలేడు. నీ punishment నీకు నయం చేస్తుంది. కనుక నీవు punishment అనుభవించకుండా పశ్చాత్తాపమనే మందును వేసుకొని దీనిని నివారణ గావించుకో. ఏదో జరిగిపోయినది జరిగిపోయినది. దానికి పాశ్చాత్తాపములో నీవు పవిత్రమైన రీతిగా రూపొందించుకోటానికి తగిన ప్రయత్నము చేయాలి. కనుక మనము నాలుక విషయము లోపల అతి జాగ్రత్తగా మనము అనుభవించాలి. ఎవరిపైన కూడను మనము చెడు మాటలు యితరులతో

519018907

చెప్పరాదు. ఎవరి యొక్క బలహీనతలు మనము వృచ్ఛరించరాదు. కారణము యేమిటి? నీకు యేమి అధికారము వున్నది. నీలో కావలసినన్ని దోషములు వుండుగాని యితరుల యొక్క దోషములను చూపించే అధికారము నీకు యెక్కడ వుంది. నీ దోషాన్ని నీవు చూసుకొని నివారించటానికి తగిన కృషి చేయి. తన కంటి లోపల పెద్ద దూలము పడి అల్లాడి పోతుంటే ప్రక్కన వున్న దోమను వేరికి గుర్తింపు చేస్తాడుట. నీలో కావలసినన్ని దోషములు కుళ్ళి కృశించి పోతుంటే దానిని గుర్తించుకోకుండా 'పరులు యిట్టివారు, అట్టివారు అని నిర్ణయించే అధికారము నీకు లేదు. లేని అధికారములో నీవు ప్రవేశిస్తున్నావు కాబట్టి మహా పాపిగా రూపొందుతావు. నాకు యీవిధమైన అధికారము వున్నదా లేదా అనే విచారణ చేసుకోవాలి. తప్పులెన్నువారు తమ తప్పు లెరుగరు. తన తప్పు తాను వెతుక్కునే వాడు ధన్యుడౌతాడే గాని పరుల తప్పులను వెతుకుతే వాడు కూడను బలూరగా మారిపోతాడు. బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. ఏ విధమైన చింతలు చేస్తాడో ఆ విధముగా చింతను తానుకూడా అనుభవిస్తాడు. నీలో నిజముగా దోషము లేకపోయినప్పటికి యితరుల దోషము నీవు వర్ణించటము చేత నీలో దోషము యేర్పడి పోతున్నది. ఒక ఉదాహరణము. నీ దగ్గర ఒక కెమేరా వుంటున్నది. నీ కెమేరా యింకొక రూపముపైన పెట్టి ఫోకసు చేసి స్విచ్ వేస్తే వాని యొక్క రూపము నీ కెమెరాలో పడిపోతుంది. అటులనే యీ దేహమనేది ఒక కెమేరా, నీ హృదయమనేది ఒక ఫిల్ము నీ వాక్కు అనేది స్విచ్. ఎవరి తప్పులపైన నీవు ఫోకస్ చేసి ఆ స్విచ్ ఆన్ చేస్తావో అది నీ హృదయములో ప్రింటు అయిపోతుంది. అతని దోషము నీలో వచ్చి పడిపోతుంది. అతని పాపము వచ్చి నీలో పడిపోతుంది. కనుక పరుల గురించి చెడ్డగా యోచించరాదు. అదే నిజమైన మానవత్వమునకు సరైన గుర్తు. 'పాపములన్నింటి కంటె మించినది పరులను నిందించేదన్నా'. అన్నారు. కేవలము నిందించటమే కాదు. హాస్యముగా కూడను పరులను యేమాత్రము చేయకూడదు. కాని ఒక్కొక్క సమయములోపల కొంచెం తమాషాలు చేయవచ్చు. ఆ తమాషా కూడ అర్థవంతమైన తమాషాగా వుండాలి. సరియైన రీతిలో బుద్ధిని కుదిర్చే తమాషాగా వుంటుండాలి.

ఒక చిన్న ఉదాహరణము. మహా తెలివితేటలు కలిగిన వాడు, గొప్ప మేధావి అద్భుతమైన writer గొప్ప విద్యావంతుడు కాకపోయినప్పటికి తనయొక్క లోచక్షము లోపల చక్కగా ప్రవర్తించే వాడు. అతనే చర్చిల్. ఇతను చిన్నప్పటి నుండి యుద్ధమంటే కత్తులు కఠారులు అంటే చాలా యిష్టము. అతనేమీ గొప్ప చదువులు చదవకపోయినప్పటికి అతను ఆర్మీలో ప్రవేశించాడు. ప్రవేశించి తనయొక్క తెలివితేటలు, తనయొక్క బుద్ధి కుశలతయొక్క విశ్వాసము గాఢమైన విశ్వాసము. అలాంటి వ్యక్తి చదువు లేకపోయినప్పటికిని బ్రిటన్ ప్రైమినిస్టరుగా అయిపోయాడు. అంతేకాకుండా నోబెల్ ప్రైజ్ అందుకున్నాడు. ఏ విద్యలు అతనిలో గొప్పగా లేవు. ఏ డిగ్రీ తాను పొందలేదు. General Knowledge, common sense అత్యవసరమన్నాడు. అతనిలో ఒకవిధమైన క్రమశిక్షణ

519018908

వుండేది. ఉపన్యాసము యివ్వాలనుకుంటే తాను ఒక రూములో ప్రవేశించేవాడు. తన నిలువుటద్దము ముందుగా నిల్చునేవాడు. ప్రసంగము చేయవలసిన వుపన్యాసమంతా నిలువుటద్దము ముందుగా ప్రసంగము చేసేవాడు. ఈ విధముగా తాను ప్రాక్టీసు చేసుకొని తన ముఖము యెట్లా నారు యెట్లా, తన action యెట్లా అని తాను చూసుకొని నా ముఖము ప్రసంగ సమయములో బాగా ప్రసన్నతగా వుంది. నా యొక్క ఆకారము కూడను మంచి perfect గా వుంటుందాది. ఆ విధముగా తాను తృప్తిపడి తదుపరి పబ్లిక్ వుపన్యాసములో ప్రవేశించేవాడు. ఎలక్షన్ వచ్చింది ఈ election లోపల తన విరుద్ధ పార్టీని ఒక వుపన్యాసములోపల చాలా ఖండిస్తూ వచ్చాడు. జోక్సు అంటే యేమిటి అనేదానికోసం యివన్నీ చెపుతున్నాను. ఆ ఎదురు పార్టీ వారిని తన యిష్టము వచ్చినట్లుగా దులిపి వేయుటము వలన అందులోంచి ఒక స్త్రీ లేచింది. అతి వుగ్రురాలై చాలా క్రోధము చేత 'చర్చిల్ shutup అంది. నిజముగా నేనే నీ భార్య అయివుంటే నీకు యింత విషము పాలలోనో, టీలోనో, కాఫీలోనో యిచ్చివేసి నిన్ను చంపివేసి వుండేదాన్ని' అన్నది. చర్చిల్ వెంటనే నేను నీ భర్తనే అయివుంటే విషము కలిపిన కాఫీని ముక్కుపట్టి నీచే త్రాగించుదును అన్నాడు. నేనే నీ భర్తనై వుంటే ఆమెకు పెద్ద అవమానమైంది పాపం. దానితో నోరు మూసుకొని కూర్చుంది. ఇది యితరుల యొక్క దోషములను అణగద్రొక్కే నిమిత్తమై వేసే జోక్సు. మరొక సమయములోపల పబ్లిక్ వుపన్యాసము చేస్తున్నాడు తన speech అయిన తరువాత చైర్ లో కూర్చున్నారు. opposite party వచ్చి తన speech యిస్తుండెది తిరిగి. అతను అస్తవ్యస్తముగా మాట్లాడుతున్నాడు. చర్చిల్ పదములు వుపయోగపెట్టినా కూడను చక్కగా, direct గా మంచి సద్వినియోగ పరచే పదములు వుపయోగించేవాడు. కానీ యీ opposite leader తన యొక్క క్రోధము, వుద్రేకము చేతను తను యేదో ఒకదానికి ఒకదానికి సంబంధము లేకుండా మాట్లాడుతూ వస్తున్నాడు. ఆ సమయములో చైర్ పైన కూర్చున్నాడు చర్చిల్. కన్నులు మూసుకొని చాలా దీర్ఘముగా యోచిస్తున్నాడు. చాలా కష్టముగా వుంటున్నాది అతని speech వినటానికి యితనికి. ఈ వుపన్యాసము ముగించే ముందుగా ఆ opposite party leader చెబుతున్నాడు యిది న్యాయమేనా నేను యింత గొప్ప leader వుపన్యాసము యిస్తుంటే చర్చిల్ నిద్రపోతున్నాడు అన్నాడు. ఇతను ప్రైమినిస్టరుగా వుండి యీ విధముగా అగౌరవము చేయవచ్చునా అన్నాడు. అప్పుడు ఒక జోక్ వేశాడు చర్చిల్ లేచి. అయ్యా! ఆ నిద్ర నాకు వచ్చిందంటే యెంత హాయిగా వుండేవాడిని ఆ నిద్ర రాకపోవటం చేతనే నేను speech వినే అవస్థ పడవలసి వచ్చింది! అన్నాడు. అనగా యీ పదములో అతనికి యేమైపోయింది నీ speech అంత అధ్వాన్నముగా వుంటున్నాదని అర్థమైపోయింది. ఇలాంటి జోక్సు మనలో వున్న దోషములు మన ద్వారానే తనకు తాను తెలుసుకోటానికి తగిన కృషి చేసేటువంటివే. అయితే యెప్పుడు చేస్తూ వచ్చాడు ఆయన జోక్సు. తాను ఒక action కు reaction గా అందిస్తూ వచ్చాడు. కనుక యితరులను మనము పరిహాసము చేయుటమంటే direct గా మనము వారిని attack చేయుటము కాదు. ఇది చాలా తప్పు.

519018909

కనుక నాలుక చేత మనము యేవిధమైన దానిని మనము వుపయోగపెట్టాలని చక్కగా నిర్ణయించుకోవాలి. మన మానవత్వము నాలుక చేతనే ఒక దివ్యమైన గౌరవమును సంపాయించుకుంటూ వున్నది. రెండవకరణము నాలుక.

మూడవది మనస్సు. ఈ మనస్సు మీకు తెలిసినదే. చఞ్చలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్. ఈ మనస్సు చాలా చంచలమైనది. ధృడమైనది. ప్రమాదమైనది. ఈ మనస్సును సక్రమమైన మార్గములో పెట్టాలి. ఇది యెప్పుడౌతుంది. మన యొక్క చేతులను, మన యొక్క వాక్కును సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టినప్పుడు సహజముగా మనసు కూడను సరైన స్థితికే వస్తుంది. కనుక మనస్సు, వాక్కు, చేతులు యీ మూడింటిని పరిశుద్ధము గావించుకోటమే త్రికరణ శుద్ధి. చేతులను పవిత్రము గావించుకోటమే కర్మయోగము. వాక్కును సద్వినియోగ పరచుకోటమే భక్తియోగము. ఈ రెండింటిని అనుసరించే విధముగా మన మనస్సును తీర్చిదిద్దుకోటమే జ్ఞానయోగము. ఇదే త్రియోగముల యొక్క స్వరూపము. ఇదియే త్రికరణశుద్ధి. ఈ మూడు యెందుకోసము మనము శుద్ధి గావించుకోవాలి. ఎందుకోసం పవిత్రము గావించుకోవాలి. ఇక్కడ చిన్న వుదాహరణముగా తీసుకోవచ్చు మీరు.

ప్రపంచమంతా కూడను పృథ్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము యీ పంచ భూతముల చేత చేరి వుంటున్నది. ఈ పంచభూతములు కూడను యే విశ్వమంతా వ్యాపించి వున్నవో ఆ పంచ భూతములే మన యొక్క దేహమును ధరించినాయి. కనుక యీ పంచభూతములను పవిత్రము గావించుకునే నిమిత్తము పవిత్రమైన ప్రవృత్తులలో ప్రవేశించాలి. ఇది యెట్లనగా. చాలా రహస్యము వుంటున్నది. పృథ్వి మనకు యేవిధముగా దేహములో కనుపిస్తున్నది. మన చర్మము, మాంసము యివి పృథ్వి చేత యేర్పడినవి. జలము యేరీతిగా వుంటున్నది దేహములో అనగా మూత్రము, రక్తము యీరెండు జలమయమైన అంశములే. ఇంక అగ్ని యేరీతిగా మన దేహములో వుంటున్నది. దాహము, ఆకలి యీరెండింటిలోనే అగ్ని యిందులో ప్రవేశిస్తున్నది. ఆకలి దప్పులతో యీ అగ్ని వుంటున్నది. వాయువు యేరూపములో వుంటున్నదంటే కదలిక, నడక యీరెండింటి యొక్క స్వరూపములో వుంటున్నది వాయువు. ఇంక ఆకాశము. ఈ ఆకాశము అనే స్వరూపము యేరీతిగా వుంటుందంటే కామ క్రోధ లోభ మద మాత్సర్యములు యీ అరిషడ్వర్గముల యొక్క స్వరూపమై యీ ఆకాశము మనలో ప్రవేశించి వుంటుండాది. కాని యీ రహస్యాన్ని మనమెవరము గుర్తించటములేదు. మన ఆకలి దప్పులే యీ అగ్ని యొక్క ప్రమాణము. మూత్ర, రక్తములే జలము యొక్క ప్రతిబింబము. మన చర్మ, కండరములే భూమి యొక్క ప్రతిరూపము. ఈ కదలిక నడక యే గాలి యొక్క చేష్టలు. మన యొక్క సుఖములే ఆకాశము యొక్క అంశములు. కనుక యీ ఐదు మన దేహములో యిమిడి వుంటున్నాయి. ఈ ఐదింటిని మనము సార్థకము గావించుకోవాలి. సార్థకము గావించుకొనుటకే మానవత్వము మనకు ప్రాప్తించింది.

519018910

విద్యార్థులారా! భగవంతు డెక్కడ అని మనము సంశయించవచ్చును సందేహించవచ్చును. వారి మహిమ విశ్వమంతయు. దీనికొక చిన్న వుదాహరణము. ఈ ప్రపంచ పటము లోపల ప్రపంచములో సమస్త రాజ్యములు కూడను యిమిడి వుంటున్నాయి. ఈ world map లోపలనే సమస్త రాజ్యములు చేరి వుంటున్నాయి. అదేవిధముగనే విష్ణువనే world map లోపల విశ్వమనే రాజ్యమంతా యిమిడి వుంటున్నది. ఐతే యీ రాజ్యము లోపల పర్వతములు, నదులు, వనములు, అడవులు యివంతా హెచ్చుపల్లములుగా కనుపించవచ్చు. ఈ సెలయేరులు, చిరుకొండలు, హిమశిలలు, జలపాత చిత్రప్రవాహములు యిలాంటి హెచ్చుపల్లములంతా map లో మనకు కనుపించవు. ప్రాపంచిక సంబంధమైన ప్రవృత్తి లోపల నీకు హెచ్చుతగ్గులు కనుపిస్తున్నాయిగాని విష్ణుస్వరూపమునందు యీ హెచ్చుతగ్గులు యేవిధముగాను కనుపించవు. సమత్వముగా వుంటాయి. కనుకనే సమత్వమును మనము పొందాలనుకున్నప్పుడు విష్ణుత్వము మనము స్మరించాలి. అద్వైతత్వము చేతనే సమత్వము మనకు ప్రాప్తిస్తుందిగాని మరొక మార్గములో మనకు సమత్వము ప్రాప్తించదు మనము ప్రాకృత దృష్టిలో చూచినప్పుడు అన్నీ భిన్నముగానే కనుపిస్తాయి. ఈనాడు మానవుడు స్వార్థము స్వార్థము స్వార్థ దృష్టితో చూడటం చేతనే సమస్తము వేరుగా భావిస్తున్నాడు. ఏ చిన్న విషయమునందు మనము స్వార్థములోనే ప్రవేశిస్తున్నాము. ఒక చిన్న వుదాహరణము. మొకు క్లాసు పిల్లలందరు చేరి స్వామితో ఒక ఫొటో తీసుకున్నారనుకొండి. ఈ క్లాసుపిల్లలందరు చేరి ఒక ఏభైమంది వుండవచ్చును. ఈ యేభైమంది ఫొటో ఫొటోగ్రాఫరు ప్రింటు చేసి తీసుకువచ్చినప్పుడు తాను యెక్కడ వున్నాడో ముందు చూచుకుంటాడుగాని యేభైమంది ముఖములు చూడనే చూడడు. ఈ ఫొటోలో కూడ యింత స్వార్థము. తాను వున్నానా లేదా తాను సరిగా కనుపిస్తున్నానా లేదా యితరులు యెక్కడైనా వుండిపోనీ అనే యింత స్వార్థము వుపయోగపెడుతున్నాము. ఈ చిన్న విషయము అలా వుంచండి. మనకు XII class Results లేక X class Results కొన్ని వేలవేలకంతా వస్తుంటాయి. Indian express లో Hindu లోపల చూస్తే రెండు పేజీలు పూర్తి నంబర్సే వుంటూ వుంటాయి. నిజముగా ఆ నెంబర్స్ చూసి అహా యింత మంది ప్యాసైనారు కదా అని ఆనందిస్తే యెంత బాగుంటుంది. దీనిని చూడరు. నా నెంబరు ఎక్కడ వుంది యీ లక్షలలో కూడా తన నెంబరే చూచుకుంటూ వస్తాడు. మొట్టమొదట అందరిని చూచి ఆనందించు. తరువాత నీ నెంబరు చూడు. తప్పక నీ నెంబరు వుంటుంది. కాని అట్లా చూడకుండా వీరంతా యేమైనా అయిపోనీ నా నెంబరు ఏడు వందలు వుండాల, ఏడు వందలనుండి నీవు చూచుకుంటూరా అక్కడికే పోయినావంటే నిజముగా వాడి నెంబరే కనుపించదు. కారణం యేమిటి narrow mind. సంకుచితమైన భావాలు. ఈ సంకుచితమైన భావాలు మన విద్యార్థులలో దూరమై పోవాలి. మన భారత దేశములో యిన్ని లక్షల మంది ప్యాసైనారని ఆనందించు. తరువాత నీ నెంబరు నీకే వచ్చేస్తుంది. ఈ విశాలమైన భావాన్ని పెంచుకొండి విద్యార్థులు. ఈనాడు భారత దేశము

519018911

యీ స్వార్థము చేతనే మునిగి పోతూ వుంటున్నది. ఈ స్వార్థము, స్వప్రయోజనము దూరము చేసినప్పుడే జగత్తు కూడను స్వప్రకాశముగా వెలుగుతుంది. ఈ నాడు భారతదేశము చాలా బీదస్థితిలో వుండే దేశమని అనేక దేశములంతా వర్ణిస్తున్నాయి. దీనికి కారణము యేమిటి? దేశమంతా కూడను కేవలము క్షీణించి పోవటానికి కారణం యేమిటి?

విద్యార్థులారా! చక్కగా గుర్తించండి. మన కోరికలు మితిమీరి పోతున్నాయి దాని చేతనే దేశము క్షీణించి పోతున్నది. ఆకాశమునకైనా ఒక అంతు వుంటున్నది. హద్దు వుంటుంది కాని మన కోరికలకు హద్దే లేదు. కనుకనే మనము యీనాడు కోరికలను అదుపులో పెట్టుకోటానికి తగిన కృషి చెయ్యాలి. అందుకే ceiling on desires అని పెట్టివుండేది. ఈ రకముగా కొన్ని కోరికలు తగ్గించుకుంటూ వచ్చేటప్పటికి ఆర్థికముగా కూడను దేశము అభివృద్ధి చెందుతుంది. ఈ నాడు మనము తీసుకున్న అప్పులు కూడను చెల్లించటానికి సాధ్యము కాకుండా వుంటున్నది. నేను అక్కడ లేను కాని నాకు తెలుసు. ఈ నాడు world Bank నుండి ఒక వ్యక్తి వచ్చాడు. అతను మన MBA పిల్లలకంతా teach చేశాడు. అతను కేవలము స్వామి చెప్పిన మాటలను అక్షరాలా పలికాడు. అతను చాలా experience వున్నవాడు. ఈ నాడు దేశములంతా దిగజారి పోవటానికి కారణం కేవలము దురాశలే. అనేక దేశములంతా యీ world Bank నుండి అప్పులు తీసుకుంటున్నాయి. ఈ అప్పులకు వడ్డీ చెల్లించలేని income కూడా లేకుండా పోతుండాది. కట్టకడపటికి వడ్డీ చెల్లించటానికి చేతకానప్పుడు యీ దేశమునే తాకట్టు పెట్టవలసి వస్తుంది. మన భారత దేశము కూడను అస్థితిలోనే వుంటున్నది. కొన్నివేల కోట్లు interest చెల్లిస్తున్నది. మన పాటికి మనము మాత్రం చక్కగా నేతి బీరకాయ వలె వుంటున్నాము. నెయ్యి అందులో యేమాత్రము లేదు. మన తెలుగులో నేతి బీరకాయ అంటారు. కానీ అందులో నెయ్యి యేమాత్రము వుండదు. అదే రీతిగనే మన భారతదేశమనేది లక్ష్మీస్వరూపము అన్నపూర్ణ స్వరూపము అనే పేరు వుంది గాని అన్నమునకు కరవై పోయింది. దీనికి కారణమేమంటే యీ desires పెరిగిపోవటం చేతనే. ఎవరికి వారు నేను MBA ప్యాస్ చేశాను నేను BE ప్యాస్ చేశాను నేను MBBS ప్యాస్ చేశాను నాకు మంచి వుద్యోగము చిక్కాలి గొప్ప సేలరీ రావాలి, ఎవరికి వారు గొప్ప salary రావాలి అనుకుంటున్నారు గాని, ఎవరికి వారు salary ని అందుకొని పోతుంటే దీనిని అభివృద్ధి పరచేవారు ఎవరు? వచ్చిన ధనమంతా వీరి salary కి పోతుంటే యింక దేశము యేరీతిగా అభివృద్ధి చెందుతుంది. కనుక ప్రతి వ్యక్తి కూడను నేను salary కి తగినంత పని నేను చేస్తున్నానా లేదా అని విచారణ చేసినప్పుడే ఆ salary సార్థకమవుతుంది. జీతాన్ని అభివృద్ధి కావాలని కోరుతున్నాము గాని work అభివృద్ధి చెందాలని కోరటం లేదు. work important. అదే మన నిజమైన శక్తి. work ను దృష్టిలో పెట్టుకోటమే morality అదే purity. work and purity is real strength. మన యొక్క strength work and purity.

విద్యార్థులారా! మీకు తెలియకుండా వుండవచ్చు. నేను చెప్పటము
చేయుటము ఒక్కటే. చిన్న విషయములో మీరు యోచించుకోవచ్చు. ఒకవారము నుండి
undergraduate పిల్లలు, Post graduate students, second year, third
year వాళ్ళు అనేక కట్టలు Post లో పంపిస్తున్నారు నాకు జాబులు. అయితే ఒకరకము
గా నాకు సంతోషము యేర్పడుతుంది. క్లాసు పిల్లలందరు ముప్పై మంది చేరి ఒక Pack
లో పంపటము వలన Post charge తగ్గిపోతుంది. ముప్పైమంది ముప్పై కవర్లలో వేసి
వుంటే Postal charge ఎక్కువైపోతుంది. అయితే వారు మరొక వుపకారము కూడా చేస్తూ
వచ్చారు. కొన్ని కవర్సుపైన మాత్రమే from అనో లేక to అనో స్వామి అనో యేదో ఒకటి పేరు
వ్రాసి పంపిస్తూ వుంటారు. మిగతా కవర్సులో from ఎడ్రస్సుగాని to ఎడ్రస్సుగాని వుండదు.
నేను యేమి చేస్తున్నానో తెలుసునా. లోపలనున్న matter అంతా నేను తీసుకొని covers
అంతా కారుణ్యానందకు collect చేయమని యిస్తాను. ఆ కవర్సు కూడను waste చేయకూ
డదని. ఎందుకంటె ఎడ్రసు వ్రాయలేదు. ఖాళీ కవర్సుగా వుంటున్నాయి. దీనిని ఎందుకు
waste చేయాలని యీ covers కూడను నేను ఎత్తిపెడుతుంటాను. నాకు పొదుపు
యీ రకముగా వుంటుంది. అప్పుడప్పుడు కొంతమంది letters వ్రాస్తూ వుంటారు. మన
పిల్లలు కూడను చాలామంది వ్రాస్తూ వుంటారు. కాగితాలు మడిచి వుంటాయి. ఒకదానిపైన
మాత్రము letter వుంటుంది రెండవ దానిపైన ఖాళీగా వుంటుంది కాగితము. ఇలాంటి
ఖాళీగా వున్న దాన్ని అడ్డముగా చించి ఖాళీ కాగితము నాదగ్గర పెట్టుకొని మిగతాది
waste paper basket లో వేస్తూ వుంటాను. ఈ విధముగా కొంచెం ఖాళీ కాగితాన్ని కూ
డను నేను వదలిపెట్టటం లేదు. దానిని కూడను పొదుపు చేస్తున్నాను. ఈ విధముగా నేను
చేస్తూ వుంటాను గాని అవసరమైతే లక్షలు కోట్లు డబ్బు యిస్తాను. అనవసరమని తెలిస్తే
ఒక నయాపైసకి కూడను నేను మొండికి వేస్తాను. కారణం యేమిటి? డబ్బు యివ్వటానికి
లొంగటం కాదు. దుర్వినియోగము చేయుటము చాలా తప్పని నా వుద్దేశ్యము. అది evil.
అందుకోసమే misuse of money is evil. ఎవ్వరు కూడను యీ విధముగా misuse
చేయకూడదు. అందులో మన Institute లోపల జాగ్రత్తగా వుండాలి. ఏ టీచర్సుకు
గవర్నమెంటుగాని Central Govt గాని, State Govt గాని జీతాలు యివ్వటం లేదు.
ఏదో ఒకరిద్దరిని appoint చేసిన వారికి మూడేండ్లు యిస్తారుగాని మూడేండ్లు అయిన
తరువాత యివ్వరు. వారు కూడా యివ్వటము లేదు. అవి కూడను regular గా రావటం లేదు.
కానీ ప్రతి lecturer కు professor కు నేను యిస్తున్నాను స్వయముగా. వారికి యేవిధమైన
కొరతగాని యేవిధమైన యిబ్బందిగాని కలిగించటము లేదు. ఈ salaries కూడను
scale ప్రకారముగా చక్కగా వారికి అందిస్తున్నాము. అయితే యీ విధముగా యిచ్చే సమ
యములో లోపించేనికి నేను లొంగను, కాని కొన్ని విషయముల లోపల ఒక్క రూపాయి
వ్యర్థము చేసినా కూడను నేను ఓర్చుకోను. కొన్ని కొన్ని కాలేజీల లోపల వ్యర్థమైన papers

అంతా తెప్పిస్తూ వుంటారు. ఈ magazine ఎత్తితే అంతా అసభ్యముగా వుంటాయి. ఇటువంటి magazines అంతా తెప్పిస్తూ వుంటారు. ఈ పిల్లలు మొండికోతులు మాదిరి వుంటే వారికి యిలాంటి magazines యిస్తే కొండకోతులుగా తయారై పోతారు. కనుకనే ప్రతి చిన్న విషయాలలో కూడను నేను జాగ్రత్త వహిస్తాను. పిల్లలకు news papers వస్తున్నా యి. ఎలాంటివి వస్తున్నాయి. ఇవి సద్వినియోగము అవుతుందా లేదా అని Professors దగ్గర అంతా నేను మాట్లాడుతూ వుంటాను. అయ్యా! మీకు వచ్చే news paper లో మీకు వినియోగము వుందా మీరు చదువుతున్నారా లేదా పిల్లలు చదువుతున్నారా లేదా మీరు పిల్లలు చదవకపోతే ఆ news paper stop చేసెయ్యండి. అది యేమైనా వుపయోగము వుంటే మీరు తెచ్చుకోండి. అని చెప్పుతూ వుంటాను. పిల్లలకు అవసరమైనవి మీరు తప్పక చేయండి నేను వద్దనను. కాని నేను నా department కదాఅని ఆ papers యీ papers తెప్పించుకొని యిష్టము వచ్చినట్లు మీరు పోతే నేను ఓర్చుకోను. కనుక మన Professors గాని లేక lecturers గాని, students గాని, vice chancellor గాని Registrar గాని, controller గాని యింకే విధమైన అధికారులు గాని ఎవ్వరు కూడను నయాపైసా దుర్వినియోగము చేయకూడదు. ఈ విషయము మీరు మనసులో పెట్టుకున్నప్పుడే మన సంస్థ దేదీప్యమానముగా వెలుగుతుంది. నాకు Right వుందని Right కు fight చేస్తే Responsibility వెళ్లిపోతుంది. Right, responsibility రెండూ రెండు wheels. రెండూ రెండు wings. కానీ యీనాడు మనము Rights కి fight చేస్తున్నాముగాని Responsibility zero. కనుక ప్రతి విద్యార్థి, ప్రతి Professor Right and Responsibility రెండూ సమానముగా చూచుకొని పోవాలి. ఈ రకమైన రీతిగా మనము యీ సంస్థను అభివృద్ధి చేసినామంటే భవిష్యత్తులో యిది ఒక ఆదర్శమైన విద్యాసంస్థగా రూపొందుతుంది.

ఇంకా కొన్ని games అవీ వుంటుంటాయి. కావలసిన సామగ్రి మనము తప్పక వుపయోగించుకోవచ్చు. కానీ యీ games అయిన తక్షణమే యీ పదార్థము లంతా నిర్లక్ష్యముగా చూస్తూ వుంటారు. Responsibility లేదు. ఎవరు వెస్థానమునకు తగిన responsibility వారు వహించినప్పుడే వారు యోగ్యులౌతారుగాని లేకపోతే వాడు అయోగ్యుడే. అలాంటి అయోగ్యులు students గాని Lecturers గాని మన Institute లో వుండటానికి వీలు లేదు. కనుక ప్రతి ఒక్కరు Responsibility తీసుకోవాలి. నాడబ్బు అయితే నేను దుర్వినియోగము చేస్తానా అని తనకు తాను పోల్చుకోవాలి. నాపని అయితే నేను యింత అలక్ష్యము చేస్తానా తనకు తాను పోల్చుకోవాలి. ప్రతి వ్యక్తి కూడను యిది తనదిగా భావించుకున్నప్పుడే సద్వినియోగము చేయగలడు. ఏదో యిది సంస్థది లే యిది సాయిబాబాదిలే అనుకుంటే మాత్రం అది ప్రయోజనము లేదు. అది అలక్ష్యమే. లంకలో సీత ప్రవేశించింది. రావణుడు అనేక విధములుగా రాముని

దూషిస్తూ వున్నాడు. ఈ విధముగా దూషించటము ఆమె వినలేక పోయింది. రాక్షసునికి సరైన
బుద్ధి నేర్పాలనే వుద్దేశ్యము తో ఓ రావణా! నీవు గొప్ప శక్తివంతుడవని, గొప్ప అధికారి వని
నీవు గొప్ప తెలివి తేటలు కలవాడివి, అనేక రకములుగా భుజ బలము బుద్ధి బలము
వర్ణించు కుంటున్నావు. రావణుడు సామాన్యుడు కాదు. అరువది నాలుగు విద్యలు అభ్యసించి
నవాడు. ఇంతే కాదు గోకర్ణ గజకర్ణములనే విద్యలను నేర్చిన వాడు. పక్షి భాష, మృగ భాష నేర్చిన
వాడు. ఇన్ని విద్యలు తెలుసుకొన్న వాడు. ఏమి ప్రయోజనము. తనను తాను తెలుసుకోలేక
పోయాడు. అప్పుడు దీనిని చక్కగా జ్ఞప్తికి చేయించింది సీత. రావణా! పరస్త్రీని అపహ
రించటము దొంగవలె నీవు ఎత్తుకు రావటము గొప్పతనమని విశ్వసిస్తున్నావు. నీ భార్యను
పర పురుషుడు అపహరించినప్పుడు యే రీతిగా భరించుకోగలవు. ఆ మాట రావణునికి
కొంచెం సూటిగా నాటుకు పోయింది హృదయంలో. పరస్త్రీని అపహరించటము సుల
భమే నా స్త్రీనే యింకొకరు అపహరిస్తే యే రీతిగా భరించుకోగలనా, సహించుకోగలనా,
శాంతిగా వుండగలనా అని తనలో తాను విచారించుకున్నాడు. అదే విధముగనే పరుల
యొక్క పని, పరుల యొక్క ధనము, పరుల యొక్క విషయము అనుకుంటే యిది ప్ర
యోజనము కాదు. నాది యితరులు అపహరించినప్పుడు నేను యే విధముగా బాధప
డతాను అనే విషయము స్వవిషయముగా మనము భావించాలి.

విద్యార్థులారా! ఇది మీ యొక్క యిల్లు. టేబులు చూచినా, కుర్చీలు
చూచినా యిది మీదిగానే మీరు భావించుకోవాలి. దీనిని పాడు చేయకూడదు. నా రూములో
వున్న దానిని నేను dirty గా పెట్టుకో కూడదు. నిజంగా నా రూము యింత అసహ్యముగా పె
ట్టుకుంటానా? ఎవరైనా మిత్రులు వచ్చి చూస్తే నాకెంత అగౌరవము. అదే విధముగనే
మీరున్న రూములు మీరు అంత పరిశుద్ధముగా పెట్టుకోవాలి. ఎవరో సామానులు అక్కడ
పడవేసి dirty చేసినా చూచిన వారు దానిని భద్రమూ చేయాలి. శుభ్రము చేయాలి.
ఒక రూములో యిరవై మంది వుంటే ఒకరికైనా బుద్ధి వద్దా. వాడు చేస్తే నాకెందుకు
వీడు చేస్తే నాకెందుకు అని యీ విధముగా పోతే యిది నీ యిల్లు అని యే విధముగా
భావించగలవు. లేకపోతే ఒక్కొక్కడు ఒక్కొక్క దినము పరిశుభ్రము చేయాలనే
Time table పెట్టుకోవచ్చు కదా. ఆ రూములు కూడను అశుభ్రముగా వుంటున్నాయి. ఓ
నొకసమయములో ఒక విద్యార్థికి జబ్బు చేస్తే చూడటానికి నేను వస్తే ఆ రూము ఒక
దిబ్బ మాదిరి వుంది. ఇది Institute కి వుండవలసిన లక్షణము కాదు. మనము పై తట్టు
తెల్లని వస్త్రము వేసుకుంటే ప్రధానము కాదు. లోపల కూడను తెల్లదనము మనము సంపా
యించుకోవాలి. మనము వాసము చేసే ప్రతి వసతి గృహము కూడను పరిశుద్ధముగా
వుంచుకోవాలి. లేకపోతే మనకు అనారోగ్యము యేర్పడుతుంది. ఆరోగ్యమే మహాభా
గ్యము కనుక మన Institute లో కేవలము చదువునందు మాత్రమే కాక games
యందు మాత్రమే కాక అన్నిరంగములందు ఆదర్శమైన విద్యార్థులుగా రూపొందాలి.

ఇవన్నీ కూడను మొన్న మన Institute లో సభ జరిగినప్పుడు చెప్పాలనుకున్నాను కాని బయట ప్రజలంతా వుంటారు. అందువలన మన గుట్టు మనము పెట్టుకోటము చాలా అవసరమని వూరుకున్నాను. ఈ నాడంతా మనవారే వుంటున్నారు కనుక చెప్పవలసి వచ్చింది. అందువలనే సంసారం గుట్టు వ్యాధి రట్టు అన్నారు పూర్వీకులు. ఇది మన సంసారము కనుక మన కుటుంబము. దీనిని గుట్టుగా పెట్టుకొని రక్షించుకోవాలనే వుద్దేశ్యముతోనే ఆనాడు ఆడిటోరియములో యీ విషయాలంతా చెప్పలేక పోయాను.

ఆరోగ్యమే మహాభాగ్యము అనటానికి మూడు కారణాలున్నాయి. వాత, పిత్త, శ్లేష్మాదులు. మూడు సమానముగా వున్నప్పుడు పవిత్రమైన ఆరోగ్యము యేర్పడుతుంది. ఈ మూడు కూడను మన దేహములో సమంగా వుంటుండాలి. అప్పుడు మన దేహము పరిపూర్ణమైన ఆరోగ్యములో వుంటుంది. ఇందులో యేకొంచెము తగ్గినా ఎక్కినా ఆరోగ్యము చెడిపోతుంది. కనుక యీ మూడింటిని మనము balanced గా వుంచుకోవాలన్నప్పుడు ఏమి చేయాలి. చక్కగా తినాలి. చక్కగా ఆడాలి. చక్కగా చదవాలి. ఈ మూడింటియందే యివి పూర్తిగా ఒక balance కు వస్తాయి. కేవలం పూరికే గొంతు వరకు తినేస్తే ఆరోగ్యము పాడైపోతుంది. తిని కేవలం కూర్చోకూడదు. తిన్నదానికి తగినట్లుగా రెండింతలు work చేయాలి. అప్పుడే ఆహారము జీర్ణమవుతుంది. ఆ జీర్ణశక్తి పూర్తిగా వున్నప్పుడే ఆరోగ్యం యేర్పడుతుంది. కనుక లక్షణముగా తినండి, తినటానికి నేను వద్దనను. కాని తిని పూరికే గుండ్రాయి వలె కూర్చోకూడదు. తినిన దానికి తగినట్లుగా మనము కొంత పని చేయాలి. కనుకనే work is worship అన్నారు. మన పనిని మనం చక్కగా చేసుకోవాలి. మన యిల్లును శుభ్రము చేసుకోవాలి. మన bath room లు clean చేసుకోవాలి. మన దుస్తులు clean చేసుకోవాలి. మన పుస్తకాలు clean గా పెట్టుకోవాలి. మన సర్వసామగ్రిని నిత్యము వుపయోగించే ప్రతీ పదార్థము కూడను పరిశుద్ధముగా వుంచుకోవాలి.

విద్యార్థులారా! మీకు తెలియకుండా వుండవచ్చును. నా జీవితములో అనగా యీ శరీరము యొక్క విషయములో ఒక చిన్న వుదాహరణ చెప్తాను. ఇది 8th Standard చదువుతూ వుండింది. అప్పుడే పెద్ద పెద్ద books అంతా యిచ్చేవారు. అది భూగోళము అని ఒక బుక్ యిచ్చారు. అది భూగోళమంత పెద్దగా వుంది. అది తల క్రింద పెట్టుకుంటే నిద్రవచ్చేది. అది పెద్ద దిండు మాదిరి వుండేది. ఇంకొకటి Civics book. ఆ సివిక్సు కూడను అంత పెద్దదిగా వుండేది. ఇలాంటి పుస్తకాలంతా చేస్తే ఒక్కొక్క పుస్తకము యింత పెద్దదైనా వాని వెల ఒక రూపాయి అర్ధరూపాయి. ఈ నాడు చపాతి అంత మందములో వున్న book యిరవై రూపాయలు. విలువలు యింత ఎక్కువైపోయాయి. ఆ నాడు 10th Standard books అన్నీ యింత పెద్ద bag కు అయ్యేటువంటివి. ఇవన్నీ చేరి పదకొండు రూపాయలు. నేను యే విధముగా వుపయోగపెట్టేవాడినంటే అంత పరిశుద్ధముగా పెట్టేవాడిని. ఈ నాటి పిల్లలు అట్టలు పైనుండి క్రింది వరకు

యేమేమో పేర్లు వ్రాసి వుంటారు. మధ్య కాగితాలలో కూడను underline చేసి వుంటారు. underline లోపల చేసుకోవాలి గాని bookలో కాదు. కాని అన్నీ నేను చదివే వాడిని. కొన్ని కొన్ని చోట్ల రెండు కాగితాలు కరచుకొని వుండేవి. చించితే కాగితములో ముక్కల్లోపల యేదైనా పోతుందేమోనని దానిని అట్లాపెట్టి అట్లా చదివేవాడిని. సంవత్సరమైన తరువాత నాకు 1st class వచ్చేసింది. ఆనాడు ప్రతి subject కూడను (ఏదో మను అతిశయోక్తిగా చెప్తున్నానని కాదు) answer paper మాకే యిచ్చేవారు కనుక ఆ టీచర్సు అంతా పైనుండి క్రిందివరకు very very --- good అని వ్రాసేవారు. నా పేపరుకు ఆరకంగా వ్రాసి పంపేవారు టీచర్లు. Pass అయ్యాను. నా యొక్క deskలో ముగ్గురు కూర్చునే వారము. నేను సెంటరులో యిటువైపు అటువైపు ఒక్కొక్క పిల్లవాడు. నేను యెంతక్లవరో వాళ్ళు అంత డల్. నాకు యెంత మార్కులో వాళ్ళకు అంత జీరోలు. ఒకనాడు ESSLC examination ప్రారంభమైంది. అప్పుడు కాగితము పెన్ను కూడను మేము తీసుకుపోకూడదు. ఒక తలుపు దగ్గర ఒక టీచరు నిల్చుకొని మా చేతులన్నీ చూసేవారు. కొంతమంది చేతుల్లో వ్రాసుకొని వుంటారు. కాళ్ళపైన వ్రాసుకొని వుంటారు. అన్నీ check up చేసి లోపలకు పంపేవారు. Empty చేతులతో లోపలకు పోవాలి. heavy heads లో లోపలకు పోవాలి. Empty headతో బయటకు రావాలి. పిల్లలు చాలా బాధపడ్డారు. నా ప్రక్కన కూర్చున్న పిల్లలు. class testలో నేను వారికి సాయం చేసేవాడిని యిద్దరికీ. కాని యీ examలో వారికి గా సాయం చేయటం. నా నెంబరు వేరు వారి నెంబరు వేరు. ఎక్కడో యింకో దగ్గర కూర్చొని వుంటారు. నేను వారికి చక్కని plan యిచ్చాను. వాళ్ళకు స్వామి అంటే ప్రాణసమానం. ఆ చిన్న వయస్సులో వారి అదృష్టం అది. ఎప్పుడు చూచినా రాజు రాజు రాజు. వారింటిలో పూడలు చేస్తే నాకు రెండు పకోడీపొట్లాలు కట్టుకొని తెచ్చేవారు పాపం. అదియు జన్మాంతర సంస్కారమో వారిది. ఆవిధమైన attachment. ఆ attachment వుండటం వలన వారికి help చేయక తప్పదు. నీవే తప్పు లేకపరంచెరగ అనేవారికి యేమైనా నేను చేస్తాను. చెప్పాను వారికి. ఏదో ఒక ట్రిక్ చేశాను నేను. ఆ రకంగా మీరు చేయండి అంతా pass అయిపోతారన్నాను. Examination hallలో కూర్చున్నాము. నాకు question paper యిచ్చారు. ఇంక అక్కడ టీచర్సు తిరుగుతూ చూస్తూవున్నారు. 2 hours time యిస్తారు నేను half an hourలో నాది వ్రాసాను. యింకొక half an hourలో మా friendది వాడి hand writing లాగా నేనే వ్రాసాను. దానిపైన వాని నెంబరు వేశాను. ఇంకో విద్యార్థి hand writing లాగ యింకో అర్ధగంటలో వాని పేపరు వ్రాసాను. వాని నంబరు, పేరు వ్రాసాను. నా దానిపైన నా number నా పేరు వ్రాసుకున్నాను. బెల్లు కొట్టటం కోసం కూర్చున్నాను యింకా అర్ధగంట కాచుకోవాలి కదా. వాళ్ళు కూడా యేమో వ్రాసుకుంటున్నట్లుగా వ్రాసుకుంటున్నారు. అంతే యేమీ చేయలేదు. బెల్లు కొట్టారు. ఇంక టీచర్సు అంతా వచ్చి papers papers అంటున్నారు. ఈ గలాటాలో యీ మూడు తీసుకువెళ్ళి నేనే పెట్టేశాను. ఈ మూడు

పేపర్లు నేనే పెట్టాను. రిజల్టు వచ్చింది. 15 days అయిన తరువాత. మా ముగ్గురిది 1st class. కాని వీరు కాపీ కొట్టారా అనటానికి ఒక్కొక్కరిది ఒకో నంబరు, ఒక్కొక్కరిది ఒకో చోటు ఎట్లా కాపీ కొట్టారు? పోనీ ఎవరైనా వ్రాసిపెట్టారా అంటే వాని handwriting వానికి వుంది. వచ్చారు పాపం. రాజూ మా పురాణాలు నిలబెట్టావని కాళ్లుపట్టుకున్నారు పాపం. మా క్లాసులో ఒక హరిజన బాలుడు వుండేవాడు. అప్పుడు కూడా నాకేమీ భేదము లేదు. ఈ caste, religion, colour అనేది యే నాటినుండో లేదు. అతను వచ్చాడు. రాజూ నేను చాలా బీదవాడిని నాకు నీ books యివ్వవా? ఆనాడు సంవత్సరం సంవత్సరం సిలబస్ మారేది కాదు. ఐదు సంవత్సరముల వరకు ఒకటిగానే వుండేది. same books. అదినేను చెప్పాను. Books ముందు చూడు. నీకే విధముగా నచ్చితే ఆవిధముగా చేయవచ్చు అన్నాను చూచాడు. ఒక్క పేపరు కూడా నలగలేదు. కొత్త books మాదిరి వున్నాయి. అప్పుడతను అన్నాడు. ఇవి కొత్త books మాదిరి వున్నాయి. నాకు అంత శక్తి లేదు. రాజూ! నేను 20 రూపాయలు ఇస్తానన్నాడు. నేను చెప్పాను friend నాకు కావలసింది పుష్పగిరి తిరునాళ్ళకి పోతున్నాను. అక్కడ నేను స్కౌటుగా పని చేయాలి. నాకు పది దినములకు ఐదురూపాయలు చాలు. ఒక అణా యిస్తే ప్రొద్దున్న నాలుగు దోశలు, మధ్యాహ్నం నాల్గుదోశలు, రాత్రికి నాలుగుదోశలు వస్తాయి. ఈనాడు ఐదు రూపాయలిస్తే ఒకదోశరాదు. నేను చెప్పాను. నాకు కావలసినది ఐదు రూపాయలే. నీ యిరవై రూపాయలు నాకు అక్కరలేదు. ఐదురూపాయలు నాకు యిచ్చి నీవు యీ books తీసుకువెళ్లు అన్నాను. తాను కొండంత ఆనందమును అనుభవించాడు. నిజముగా నేను యీ books కొనాలంటే నేను యెంతో అప్పు చేయవలసి వచ్చేది. కనుక రాజా నాపైన దయతో చాలా చీప్ గా యిచ్చావు అని ఆనందముగా వెళ్లాడు.

కనుక విద్యార్థులారా! ఆశకు ఒక అదుపు వుండాలని మీకు యీ కథ చెపుతున్నాను. ఆనాడు రూపాయినోట్లు, రెండు రూపాయినోట్లు యేమీ వుండేవి కావు. ఈ ఐదు రూపాయలు కూడను దమ్మిడీలు, అణాలు యింత మూటగా పట్టుకొచ్చాడు. నాకు సంవత్సరమంతా చేరి రెండు షర్టులు, రెండు నిక్కర్లు మాత్రమే. నేను ప్రతి క్లాసులో 1st వస్తున్నాని fail అయిన వాళ్లకు నాపైన ద్వేషము. వాళ్లు బుక్కపట్నం నుండి పుట్టపర్తికి యెట్లో నా కాళ్లు పట్టుకొని యీడ్చుకొని వచ్చేవారు. మేము తప్పు చేస్తే నీవుకూడా తప్పు చెప్పాలి. రైటు చెప్పకూడదని వాళ్ల మొండితనము. టీచరు question వేస్తే మేము తప్పు చెప్తే నీవు కూడా తప్పే చెప్పాలి. నాకు రెండు విధములైన బాధలక్కడ. తప్పు చెప్తే టీచరు కొడతాడు, రైటు చెపితే పిల్లలు కొడతారు. పిల్లలతో దెబ్బలు తిన్నా రైటే చెప్పాలని నా పుద్దేశ్యము. సత్యానికి యెంత బాధలెదురైనా ఫరవాలేదు. ఈ విధమైన సత్యమార్గము అనుసరించి చెప్తువచ్చాను. అంత పెద్ద మూట తెస్తే నేను యెక్కడపెట్టుకొనేది. నాకు పెట్టె లేదు. వేరే వస్త్రాలు లేవు. సాక్షాత్తు జరిగింది చెపుతున్నాను. నాకు పాతది ఒక నిక్కరు.

519018918

వుంది. నేను దానిని చించి దానిలో యీ డబ్బులన్నీ మూట కడదామని గట్టిగా లాగాను. అది పాత
ది కనుక పిగిలిపోయి చినిగి పోయింది. నేను యింకొకరి యింటిలో వుండి చదువుకుంటు
న్నాను, ఇక్కడ 10th class వరకు స్కూలులో లేదు. ఇది చిరిగిపోయి డబ్బులన్నీ క్రిందపడ
గానే ఆయింటి వారొచ్చి ఆ దొంగతనం చేశావా యీడబ్బులంతా అని పట్టుకొని కొట్టారు, ఆడ
బ్బు కూడా వారు తీసుకున్నారు. ఇంక నేను రేపటి దినము వస్తానని చెప్పాను. ఎట్లాపోయేది నేను.
ఈ పుష్పగిరి తొమ్మిది మైళ్లు వుంటుంది. చెప్పిన మాటను దక్కించుకోవాలనే వుద్దేశ్యముతో
early morning 4 గంటలకు బయలుదేరాను. వెన్నెలగా వుంది. తొమ్మిదిమైళ్లు నడచు
కొని పోయాను. అందరికి తెలుసు. ఇప్పుడే యింత ఎత్తువున్నాను. తొమ్మిదేండ్లప్పుడు యింత
యెత్తే వున్నాను. నాక్లాసులో నేను కూర్చుంటే మహబూబ్‌ఖాన్ వాళ్లందరు డెస్కుపైన కూర్చుంటే
నన్ను deskపైన కూర్చోమనేవాడు. ఎందుకంటె కనబడను. నన్ను చూడాలి అతను. అది ఏ
దో జన్మాంతర సంస్కారము. నన్ను చూస్తేగాని అతను పాఠము చెప్పలేడు. నడచుకు పోయాను.
అప్పటికే యీ బస్సులో పోయిన వారంతా చేరుకున్నారు. నాదగ్గర డబ్బులేదు. వారితో చేరితే
canteen దగ్గర డబ్బుకట్టాలి. బస్సుకి డబ్బుకట్టాలి. నాదగ్గర ఎక్కడికుండి వస్తుంది. రొట
్టె వారితో చేరలేదు. అది కడప జిల్లా నీరుకు చాలా కష్టం. నడచి నడచి దాహమైంది.
నీరు కూడా లేదు. తెల్లవారి లేచాను, నీరు త్రాగుదామని పోతే నీరు ఎక్కడా లేదు. కొన్నిచో
ట్ల పశువులనంతా కడగటానికి ఒక గుంటలో నీరువుంది. అక్కడికి వెళ్లాను. అక్కడ ఎవ
రూ కన్పించలేదు. ఆనీరు త్రాగేశాను త్రాగి వెనుకకు వస్తూవుంటే ఒక రాయిపైన బీడీల
కట్ట ఒక అణావున్నాయి, ఎవరో పశువుల కాపరి విడచిపెట్టి పోయాను. ఈ బీడీలు, సిగరె
ట్టు తాగటం అంటె నాకెప్పుడూ యిష్టంలేదు. అందువల్ల ఆబీడీలు ముక్కలు చేసి యిసుకలో
కూర్చి అణా తీసుకొని వచ్చేశాను. ఎవరైనా కనుపిస్తే వారిదేమోనని అడుగుదామని చూశా
ను. ఎవ్వరూ లేరు. ఈ ఒక్క అణాతో పదిదినములు ఎట్లా వుండటం యిక్కడ. యోచన
చేశాను. ఆకాలములో బజారులో బుడబుడకాటా ఆట అని ఆడేవారు. ఆఠీను, కళావరు, ఇ
స్పేటు యిలా కలిపి పెట్టేవారు. దీనిపైని మనం బిళ్లు పెడితే ఎన్ని వస్తే అన్ని వచ్చేవి. దానిని
గాంబ్లింగు అంటారు. నాకు పదిదినాలకి పన్నెండు అణాలు చాలు. అణాకు నాలుగు బిళ్లు.
ఒకోదానిపైన అంతపెడుతూ ఆడుతూ వచ్చారు. double, double వచ్చేసింది. ఒక స్నేహి
తుడు చూశాడు, నీకు దండిగా వస్తుంది ఆడు ఆడు అన్నాడు. పన్నెండణాలు వచ్చేంతవర
కు మాత్రం నేను ఆడాను. ఆ తరువాత నేను ఆడనని చెప్పాను. నాకెంత కావాలో అంత వచ్చిం
ది. చాలు అని చెప్పాను. సీలింగ్ ఆన్ డిజైర్స్. నాకు అవసరమైనంత చాలు. వస్తుంది కదా
అని అధికముగా పోతే చాలా ప్రమాదము. కనుక ప్రతి ఒక్కవిషయమునందు కూడను ఆనా
టి నుండి యీనాటి వరకు యింతనో అంత. దానికి తగినంతనే వస్తువుంటుంది. ఈ విద్యా
ర్థులందు కూడా యీ క్రమశిక్షణ, పొదుపుతనము, సత్యవాక్కు వుంటె జగమంతా కళకళ
లాడుతూ కలకలనవ్వుతుంది.

519018919.

విద్యార్థులారా! ఇలాంటి చరిత్రలు స్వామి విషయములో వందలుకు వందలు వేలకు వేలు వుంటున్నాయి. Ideal life గా వుంటుండాలి. ఎవరన్నా ఏమన్నా ఏమాత్రము జవాబు యివ్వకూడదు. ఆవిధమైన జీవితాన్ని గడిపినప్పుడే మానవత్వము దివ్యత్వముగా మారిపోతుంది. ఈనాటి వరకు, యిపటికి 63 సంవత్సరములు అయినప్పటికి ఒకరివద్ద ఒక్క వస్తువు నేను అడగలేదు. ఏ ఒక్క విషయంగాని ప్రాపంచికంగా పారమార్థికంగా గాని నేను అడగటంలేదు. మనసు దుంబిగా వుంటే మనిషి పరుగెత్తి వస్తాడు. ఈనాటి మానవుడు యీ త్యాగములో యేమాత్రం కూడను ప్రవేశించలేదు. ఎలావుంటుంది త్యాగము. ఒక్క ఐదు నిముషములు కాఫీ కప్పు లేటు అయిందంటే వుగ్రుడైపోతాడు. ఈనాటి మానవుడు ఒక సిగరెట్టు ఐదు నిముషములు లేటుగా త్రాగాడంటే వాడు పిచ్చివాడుగా మారిపోతాడు. ఇలాంటి వాడు యింద్రియ నిగ్రహము యేరీతిగా చేయగలడు. కనుక మొట్టమొదట మనము slave కాకూడదు. master కావాలి. మన senses కు అంతా మనము master కావాలి. వాడే నిజమైన మానవుడు. ఏ చిన్న విషయానికి గాని, ఒక తలంపుకు గాని కేవలం slave మాదిరి పరుగెత్తి పోతూ వుంటే యిది కేవలం మానవాకారములో వున్న రాక్షసత్వంగా మారుతుంది.

విద్యార్థులారా! మీరు సత్యాన్ని పలకండి. సత్యానికి సర్వము త్యాగము చేయండి. ఆడిన మాటలు తప్పకండి. యోచించి మాట యివ్వండి. మాట యిచ్చి తప్పితిరా యింక జీవితమే వుండదు. జరిగిన దానికి పశ్చాత్తాప పడండి. Ideal life ని మీరు అనుభవించండి. దేశానికంతా మీరు ఒకవిధమైన Ideal life ను అందించండి. ఇది మీ అదృష్టవశాత్తు యిలాంటి అవకాశము లభించింది. ప్రపంచములో యెంతమంది లేరు. ఇక్కడ యింతమందే రావటానికి ఎంత అదృష్టవంతులో యేమో! మీ అదృష్టాన్ని నిల్పుకోండి. స్వామి అనుగ్రహానికి పాత్రులు కండి. తల్లిదండ్రులను సంతోషపెట్టండి. ఈ విశాల భారతదేశానికి సరియైన నాయకులుగా మీరు తయారుకండి. ఖర్చులు తగ్గించుకోండి. ఆశలు విరమించుకోండి. వుండవలసిన స్థాయిలో మీరుండి గౌరవమును నిలుపుకోండి. ఇదే విద్యలలోపల సారమైన విద్య. భగవంతునిపై విశ్వాసము మాత్రము వదలకండి. ఆ విశ్వాసమే మీ శ్వాసగా భావించండి. నిరంతరము భగవంతుని చింతించండి. తప్పక మీకు చిత్తశుద్ధి యేర్పడుతుంది.